సాక్షి వరంగల్

ఆదివారం | 19 | మార్చి | 2023



అనాథలను కదిలిస్తే కన్నీళ్లే..!

చివరి మజిలీలో ఆదరణ లేక కొంతమంది వృద్ధులు ఆశ్రమంలో కాలం వెళ్లదీస్తున్నారు. వారిని కదిలిస్తే కన్నీటి పర్యంతమవుతున్నారు. - 8లో▸



చావే దిక్కు.. ఇక పనులు చేయం

'పదకొండు నెలలుగా బిల్లులు రావట్లేదు. పంచాయతీ నిధులు అందట్లేదు. ఇక మాకు చావే దిక్కు' అని అధికార పార్టీ సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. - 9లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/19^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బాధ్యులు



నర్సంపేట రూరల్: వరంగల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రావీణ్యను వరంగల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బాధ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈకార్యక్రమంలో వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్, కోశాధికారి యుగేందర్, నర్సంపేట అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు, కోశాధికారి భూపాల్ రావు, అంజయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

314 మంది గైర్హాజరు

కాశీబుగ్గ సెంటర్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్ష ఇంగ్లిష్ పేపర్‌ను శనివారం నిర్వహించారు. 27 పరీక్ష కేంద్రాల్లో 6,698 మందికిగాను 6,384 మంది పరీక్ష రాశారు. 314 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. జనరల్ కోర్స్ విద్యార్థులు 5,871మందికిగాను 257మంది గైర్హాజరైనట్లు, ఒకేషనల్ కోర్స్ విద్యార్థులు 827 మందికిగాను 57మంది గైర్హాజరైనట్లు వివరించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నెక్కొండ: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన శతాధిక వృద్ధురాలు కొంకాల వీరమ్మ(109) శనివారం మృతి చెందింది. వీరమ్మ కొద్ది కాలం క్రితం వరకు తన పనులు తానే చేసుకునేది. ఇటీవల వయోభారంతో అనారోగ్యానికి గురైంది. శనివారం మృతి చెందింది. వీరమ్మ నాలుగు తరాలను చూసింది.

సంతోశ్‌ను అభినందించిన మంత్రి



పర్వతగిరి: నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన మండల కేంద్రానికి చెందిన కంటెం సంతోశ్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం అభినందించారు. శాలువాతో సత్కరించారు.

పెళ్లి మండపంలోనే వివాహ ధ్రువీకరణ పత్రం



గీసుకొండ: మండలంలోని కొమ్మాల లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద సంగెం మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కడారి కవిత వివాహం శిదేవన్‌యాదవ్‌తో శనివారం జరిగింది. వారి వివాహానికి డీఎల్పీఓ కీర్తి ప్రభాకర్, మాజీ ఎంపీడీఓ మల్లేశం, సంగెం ఎంపీఓ కొమురయ్య, స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎం.సుధాకర్ హాజరయ్యారు. పెళ్లి మండపంలోనే వధూవరులకు పంచాయతీ కార్యదర్శి వివాహ ధ్రువీకరణ సర్టిఫికెట్ అందించారు. ప్రతీ గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు వివాహం జరిగే మంటపాల వద్దకు వెళ్లి అక్కడే మ్యారేజ్ సర్టిఫికెట్లు జారీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలి



నెక్కొండ: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 2వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని చల్లా గోదాముల సముదాయంలో శనివారం మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు దోపిడీ వర్గాలకు దోచిపెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడుతున్నాయని విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఏప్రిల్ 2, 3 తేదీల్లో జరిగే మహాసభల్ని విజయవంతం చేసేందుకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, శివరాత్రి రమేశ్, ముస్కు నర్సయ్య, మదూరి చంద్రమౌళి, మేకల రమేశ్, బండి వెంకట్, మార్గం శ్రీనుతో, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

అభయహస్తం.. అస్తవ్యస్తం!

జిల్లాలో 96,427 మంది నుంచి నగదు వసూలు

- 2014లో పథకం రద్దు
- నిరాశలో మహిళలు..



అభయహస్తం పథకంపై చర్చిస్తున్న మహిళా సంఘాల సభ్యులు(ఫైల్)

నల్లబెల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి పేద, మధ్య తరగతి మహిళల జీవన భృతి కోసం 2009లో ప్రతిష్టాత్మకంగా అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈపథకంలో చేరిన మహిళలకు 60ఏళ్ల తర్వాత పెన్షన్ అందిస్తూ.. వారి పిల్లలకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.1,200 చొప్పున ఉపకార వేతనాలు అందించారు. అటు పెన్షన్, ఇటు ఉపకార వేతనాలు అందించిన పథకం ఐదేళ్లు కొనసాగింది. అనంతరం రద్దు కావడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఈపథకాన్ని రద్దుచేసిన తర్వాత చెల్లించిన డబ్బులు ప్రభుత్వం ఇంకా ఇవ్వట్లేదని మహిళలు వాపోతున్నారు. మహిళలు అభయహస్తం పథకం కింద చెల్లించిన డబ్బులను తిరిగి తమ ఖాతాల్లో జమ చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులు..

వరంగల్ జిల్లాలో 323 గ్రామ పంచాయతీల్లో స్వయం శక్తి మహిళా సంఘాల మహిళలు చెల్లించిన అభయహస్తం ఇన్సూరెన్స్ డబ్బుల కోసం మహిళలు 9 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. 51 నుంచి 60 ఏళ్లు నిండిన మహిళలు పదేళ్లకు సంబంధించిన అభయహస్తం ఇన్సూరెన్స్ డబ్బులు రూ.3,650 చెల్లించారు. 50 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారి నుంచి రోజుకు రూపాయి చొప్పున ఏడాదికి రూ. 365 వాటాగా నాలుగేళ్ల పాటు ప్రతీ మహిళ ఇన్సూరెన్స్ కోసం డబ్బులు చెల్లించింది. వయస్సు ఆధారంగా ఐకేపీ సిబ్బంది డబ్బులు వసూలు చేసి ప్రభుత్వం ఖాతాలో జమ చేశారు.

96,427 మంది నుంచి వసూలు..

2009లో పథకం ప్రారంభం కాగా.. 2014లో రద్దు చేశారు. జిల్లాలో స్వయం శక్తి మహిళా సంఘాల్లోని 96,427 మంది నుంచి అభయ హస్తం ఇన్సూరెన్స్ కోసం డబ్బులు వసూలు చేశారు. 60 ఏళ్లు పైబడిన వారికి ప్రతి నెలా రూ.500 పింఛన్ అందించారు. ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్‌ను రూ.2,016లకు పెంచింది. దాంతో.. రూ.500 పింఛన్‌ను నిలిపేసింది. కానీ.. మహిళలు చెల్లించిన ఇన్సూరెన్స్ డబ్బులు నేటికీ రాలేదని మహిళలు వాపోతున్నారు. ఈవిషయమై పలుమార్లు ఐకేపీ సిబ్బందిని ప్రశ్నించగా.. ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉందని, తాము చేసేదేమీలేదని సమాధానమిస్తున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి కేటీఆర్ జిల్లాకు రూ.17 కోట్లు చెక్కును అధికారులకు అందించినట్లు తెలిపారు. కానీ.. ఈ డబ్బులు మహిళల ఖాతాల్లో జమ కాలేదని మహిళలు చెబుతున్నారు. ఇప్పటికైనా.. ఈపథకంలో చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వాలని వారు కోరుతున్నారు.

నాలుగేళ్లు డబ్బులు కట్టిన..



రోజుకు రూపాయి చొప్పున ఏడాదికి రూ.365 .. ఇలా నాలుగేళ్లు చెల్లించాను. 2014 తర్వాత ఈ పథకాన్ని రద్దు చేశారు. కానీ.. చెల్లించిన డబ్బులను ప్రభుత్వం తిరిగి నేటికీ ఇవ్వలేదు. నాతోటి మహిళలంతా డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈపథకంలో జమ చేసిన డబ్బులకు వడ్డీతో సహా తిరిగి సభ్యురాలికి చెల్లించాలి.

– తడుక పుష్పలీల, రాజ్యలక్ష్మి ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు, నల్లబెల్లి

త్వరలోనే జమ చేస్తాం..



జిల్లాలో అభయ హస్తం పథకంలో 96,427 మంది అభయ హస్తం ఇన్సూరెన్స్ పథకంలో డబ్బులు జమ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సభ్యుల వివరాలను ప్రభుత్వానికి అందించాం. ఇటీవల జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. మంత్రి కేటీఆర్ జిల్లాకు సంబంధించి సభ్యులకు డబ్బులు తిరిగి చెల్లించేందుకు రూ.27 కోట్ల విలువైన చెక్కును అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే వారి ఖాతాల్లో జమ చేస్తాం.

– సంపత్ రావు, డీఆర్డీఓ, వరంగల్

కొబ్బరి చిప్పల కథేంటంటే..

జాతరలు, ఉత్సవాల నుంచి తూర్పుగోదావరి జిల్లాకు..

- అక్కడ నూనె తీసి కేరళకు ఎగుమతి
- సుగంధ ద్రవ్యాలు, సబ్బుల తయారీలో కొబ్బరి నూనె వినియోగం



కొమ్మాల జాతరలో చిప్పల నుంచి కొబ్బరిని వేరు చేస్తున్న వ్యాపారులు(ఫైల్)

గీసుకొండ: జాతరలు, తిరునాళ్లలో భక్తులు కొబ్బరి కాయలు కొడుతుంటారు. ఒక ముక్క దేవుడికి వదిలి.. మరో ముక్కను తీసుకెళ్తుంటారు. ఆ వదిలిన కొబ్బరి ముక్కలు రాష్ట్రాలు దాటుతాయని చాలా మందికి తెలియదు. ఈ మధ్య కొంత మంది చిరు వ్యాపారులు కొబ్బరి ముక్కలకు చెక్కెర ఇస్తామని మైకులు పెట్టుకొని ఊళ్లల్లో తిరుగుతున్నారు. అలాగే.. జాతరలు, తిరునాళ్లు, ఉత్సవాల్లో భక్తులు కొట్టిన కొబ్బరి ముక్కలన్నీ కోనసీమకు చేరుతున్నాయి. తూర్పు గోదావరి జిల్లాల్లోని కొబ్బరి తోటలతో పాటు దానికి సంబంధించిన ఇతర ఉత్పత్తుల ప్రక్రియకు సంబంధించిన యూనిట్లు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. కొబ్బరి చిప్పల్ని సేకరించేందుకు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వ్యాపారులు ఎక్కువగా ఉమ్మడి వరంగల్‌కు వస్తుంటారు. వాటిని టెండర్ల ద్వారా పోగు చేసుకుని స్టాక్‌పాయింట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా స్టాక్ పాయింట్ల నుంచి చిప్పలను తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేటకు వ్యాన్లలో తరలిస్తున్నారు. అక్కడికి తరలించిన తర్వాత నాలుగు రకాలుగా కొబ్బరి చిప్పలను గ్రేడింగ్ చేస్తున్నారు. చిప్పల నుంచి వేరు చేసిన కిలో కొబ్బరి నుంచి గ్రేడ్‌ల వారీగా 650 గ్రాముల నుంచి 800 గ్రాముల వరకు నూనె తీస్తున్నారు. చిప్ప నుంచి వేరు చేసిన కొబ్బరి నుంచి అంబాజీపేటలో వ్యాపారులు మిల్లుల్లో నూనె తీస్తారు. ఈ ప్రక్రియలో రెండు రకాల నూనె వస్తుంది. మొదటి రకం నూనెను కేరళ ప్రజల వంటల కోసం ఎగుమతి చేస్తుండగా.. రెండో క్వాలిటీ నూనెను సబ్బుల తయారీ, పలు సుగంధ ద్రవ్యాల తయారీలో ఉపయోగిస్తున్నట్లు.. నూనె తీయగా మిగిలిన కొబ్బరి పిండిని పశువులకు దాణాగా వేస్తున్నట్లు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వ్యాపారి వెంకటరమణ తెలిపారు.

కుల సంఘాల మధ్య చిచ్చుపెడుతున్న ఎమ్మెల్యే

- మాజీ మంత్రి కొండా సురేఖ



వరంగల్ పిన్నవారి వీధిలో పర్యటిస్తున్న మాజీ మంత్రి కొండా సురేఖ

వరంగల్ చౌరస్తా: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కులాల మధ్య చిచ్చుపెట్టి ఎమ్మెల్యే నరేందర్ రాజకీయం చేస్తున్నారని మాజీ మంత్రి కొండా సురేఖ విమర్శించారు. శనివారం వరంగల్ 28వ డివిజన్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర జరిగింది. బట్టలబజారు, పాతబీటుబజారు, పిన్నవారి వీధి, ఎల్లంబజారు తదితర కాలనీల్లో పర్యటించారు. పలు వ్యాపార సముదాయాల్లో వ్యాపారులను సురేఖ కలిసి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ నగరం నడిబొడ్డున ఉన్న 28వ డివిజన్‌లో వీధి లైట్లు వెలగక అంధకారం నెలకొంటుందన్నారు. కాంగ్రెస్ నాయకులు మడిపెల్లి కృష్ణ, కురుమిల్ల సంపత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మీసాల ప్రకాశ్, నల్లగొండ రమేశ్, చిప్ప వెంకటేశ్వర్లు, కొత్తపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో విఫలమైన ప్రభుత్వం

- కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ వెంకటయ్య



మాట్లాడుతున్న నరుకుడు వెంకటయ్య

వర్ధన్నపేట: పదేళ్ల పాలనలో గ్రూప్ వన్ నోటిఫికేషన్ ఒక్కసారి మాత్రమే వేశారని, అదికూడా సరిగ్గా నిర్వహించలేక తెలంగాణ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా చైర్మన్ నరుకుడు వెంకటయ్య దుయ్యబట్టారు. శనివారం వర్ధన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎంసెట్, గ్రూప్–2, టీఎస్‌పీఎస్సీ అన్ని పరీక్ష పత్రాల లీకులేనన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇంత అన్యాయం జరుగుతున్నా.. ఆ సమస్యలను గాలికి వదిలేసి తమ బిడ్డ కవితను కాపాడుకోవడానికి ఢిల్లీ వెళ్లి అక్కడ రాజకీయం చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. సీఎం కేసీఆర్ చేతిలో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు కీలు బొమ్మలుగా ఉన్నారని విమర్శించారు. రాజ్యాంగ నిబంధనలు పాలకులు పాటించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈలీకేజీల వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. అన్ని పరీక్షల లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎండీ అక్బర్, గజ్జల సదయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి

- నిట్ కళాశాల డీన్ పులి రవికుమార్
- ముద్దునూరును దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటన



మొక్క నాటుతున్న నిట్ కళాశాల డీన్, అధ్యాపకులు

దుగ్గొండి: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధికి పునాదులు పడతాయని వరంగల్ నిట్ కళాశాల డీన్ పులి రవికుమార్ అన్నారు. మండలంలోని ముద్దునూరు గ్రామాన్ని నిట్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శనివారం సందర్శించారు. గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీన్ రవికుమార్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతీ ఇంటికి సర్వే చేపట్టి గ్రామ అవసరాలను గుర్తించి ఉన్నతాధికారులకు వివరించనున్నట్లు తెలిపారు. చక్కని ప్రణాళికలతో గ్రామ సమగ్రాభివృద్ధికి నిట్ కృషి చేస్తోందన్నారు. తమ విద్యార్థులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవూరి సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు శివకుమార్, ఉదయ్‌కుమార్, 40 మంది కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై విచారణ చేపట్టాలి



వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

- బీజేపీ నాయకుల నిరసన



బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

వరంగల్ చౌరస్తా: టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ హెడ్ పోస్టాఫీస్ వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. ఇంతేజార్‌గంజ్ పోలీసులు అక్కడికి చేరుకుని నాయకులను అరెస్టు చేసి అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీధర్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎడ్ల అశోక్‌రెడ్డి, బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, పిట్టల కిరణ్, కాసు శిల్ప, గడ్డలకుమార్, వెంకటేశ్వర్లు, మహేశ్, మురళీకృష్ణ, మాదాసు రాజు, ఒంటెల ప్రసాద్, చిన్న, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడడం అందరి బాధ్యత

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సీపీఆర్ డెమో చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి



సీపీఆర్ డెమోలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో మేయర్, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

వరంగల్ రూరల్: ప్రజల ప్రాణాల్ని కాపాడడం అందరి బాధ్యత అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం వరంగల్ కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ నిర్వహించారు. ఇందులో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు సీఎం కేసీఆర్ నిత్యం శ్రద్ధ చూపుతున్నారన్నారు. కళ్ల ముందు తిరిగినవారు చూస్తుండగానే.. ఆకస్మిక గుండెపోటు కారణంగా క్షణాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సీపీఆర్‌పై శిక్షణ ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రయివేట్ అసోసియేషన్లు, కాలేజీ యాజమాన్యాలు, ఇతర ఎవరైనా.. సీపీఆర్‌పై శిక్షణ కావాలని అడిగితే హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లను పంపిస్తామని కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. తాను హైదరాబాద్‌లో పని చేస్తున్నప్పుడు ప్రతీ కానిస్టేబల్, హోంగార్డు సీపీఆర్ శిక్షణ చేసి రావాలని నిబంధన పెట్టామన్నారు. జిల్లాలో పోలీస్ కమిషనరేట్ పరిధి ట్రాఫిక్, నాన్–ట్రాఫిక్, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో సహా అందరినీ సీపీఆర్ శిక్షణలో భాగస్వాములను చేసి, ఆకస్మికంగా గుండెపోటుకు గురయ్యేవారిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని సీపీ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మేయర్ సుధారాణి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్రజ్యోతి, వర్ధన్నపేట శాసనసభ్యులు అరూరి రమేశ్, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) శ్రీవత్స కోట, (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకాడే, డీఎంహెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కోర్సు పీజీ పరీక్షలు ప్రారంభం

- 20 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నపత్రాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్షలు 2.20 నిమిషాలకు ప్రారంభమయ్యాయి. పరీక్షల విభాగం నుంచి యూనివర్సిటీ పరిధిలోని పరీక్ష కేంద్రాలకు ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రాలు పంపుతారు. అయితే సాంకేతిక కారణాలతో సర్వర్‌డౌన్ కావడం వల్ల ఆ ప్రశ్నపత్రాలను ఓటీపీ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవడంలో సమస్య తలెత్తింది. దీంతో 20 నిమిషాలు ఆలస్యంగా అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో పరీక్ష సమయాన్ని 20 నిమిషాలు అదనంగా కేటాయించారు. సర్వర్ డౌన్ కావడం వల్ల ఈ సమస్య తలెత్తిందని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. ఈనెల 20, 23, 25, 27 తేదీల్లో కూడా పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్ష కేంద్రాలను అధికారులు పరిశీలించారు.

లోక్ అదాలత్‌తో కక్షిదారులకు న్యాయం

- హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి



కక్షిదారులకు అవార్డు కాపీ అందజేస్తున్న హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కృష్ణమూర్తి

వరంగల్ లీగల్: బ్యాంక్ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారంతోపాటు కక్షిదారులకు న్యాయం జరుగుతుందని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎం.కృష్ణమూర్తి అన్నారు. వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన బ్యాంక్ లోక్ అదాలత్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా పరిధిలో యూనియన్ బ్యాంకు మొత్తం 23 పీఎల్‌సీ కేసులకు.. రూ.53.70 లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. అలాగే.. హనుమకొండ జిల్లాలో 19 పీఎల్‌సీ కేసులకు.. రూ.43,26,200 చెల్లించడానికి ఒప్పందం కుదిరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు ఉపేందర్‌రావు, బి.శ్రీనివాసులు, యూనియన్ బ్యాంకు రీజినల్ అధికారి పలుగుల సత్యం, లా ఆఫీసర్ ఎం.శశిధర్, వివిధ బ్యాంకు మేనేజర్లు, పలు గ్రామాల కక్షిదారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను కట్టడి చేద్దాం..

- సీపీ ఏవీ రంగనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైమ్: బాలల హక్కులను కాపాడటంతోపాటు బాల్య వివాహాలను కట్టడి చేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో బాల్య వివాహాలు, భ్రూణ హత్యల నియంత్రణపై సీడబ్ల్యూసీ సభ్యులు, సీడీపీఓలు, తహసీల్దార్లు, ఎంఈఓలు, పోలీస్ అధికారులతో సీపీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు అధికంగా జరిగే ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కోసం సంబంధిత అధికారులు శ్రమించాల్సి ఉంటుందన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై పోలీసులు దృష్టి సారించాలని, సమాచారం అందిస్తే వివాహం ఆపేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలను అరికట్టేందుకు స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలని, వ్యభిచారం జరిగే ప్రాంతాలు, నిర్వాహకులపై నిఘా కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ మురళీధర్, పరిపాలనా విభాగం అదనపు డీసీపీ పుష్పారెడ్డి, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత తోపాటు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఏహెచ్‌టీయూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌పై టోల్ ప్లాజా సిబ్బంది దాడి

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు.. ఇరువురిపై కేసు నమోదు
- అరగంట పాటు వీక్షించినా పని చేయని ఫాస్టాగ్
- ఇదేంటని అడిగినందుకు దాడి

రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల టోల్‌ప్లాజా సిబ్బంది ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. సాంకేతిక కారణాలతో ఫాస్టాగ్ పని చేయని సమయంలో వాహనదారులకు సర్ది చెప్పాల్సిన సిబ్బంది, వారిపై దాడులకు దిగుతున్నారు. గతంలోనూ అనేక గొడవలు జరిగాయి. తాజాగా శుక్రవారం రాత్రి ఏకంగా సర్పంచ్, ఆయన బంధువులపై అక్కడి సిబ్బంది దాడికి దిగారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ వీరేందర్ తెలిపారు. మండలంలోని ఖిలాషాపూర్ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్ శుక్రవారం మధ్యాహ్నం తన టీఎస్ 03 ఈపీ1500 నంబర్ కారులో వివాహానికి హాజరయ్యేందుకు బంధువులతో కలిసి హనుమకొండకు వెళ్లారు. నిత్యం ఆ మార్గంలో రాకపోకలు సాగించే అతను రూ.315తో నెల పాస్ తీసుకున్నాడు. అక్కడ ఆర్‌ఎఫ్ఐడి రీడ్ చేయకపోవడంతో ఫాస్టాగ్‌లో రూ.200 రీచార్జ్ చేసుకొని వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా టోల్ ప్లాజా వద్ద మళ్లీ పాస్ పని చేయకపోవడంతో మరో రూ.200 ఫాస్టాగ్ రీచార్జ్ చేశాడు. 15 నిముషాల సమయం పడుతుందని సిబ్బంది చెప్పడంతో వెనక్కి వెళ్లిన ఆయన 20 నిముషాల పాటు వేచి చూశాడు. తిరిగి వెళ్లగా అప్పుడూ ఫాస్టాగ్ పని చేయలేదు. దీంతో నెల పాస్ పనిచేయదు. ఫాస్టాగ్ పని చేయదు ఇక్కడ ఎంత సమయం వేచి చూడాలని సర్పంచ్ ప్రశ్నించారు. ఈ క్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది సర్పంచ్‌తో పాటు ఆయన బంధువులపై దాడికి దిగారు. దీంతో సర్పంచ్ రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాడికి పాల్పడిన టోల్ సిబ్బంది రాజనీష్, శ్రవణ్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా టోల్‌ప్లాజా సిబ్బంది తీరుపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అనాథలను కదిలిస్తే కన్నీళ్లే..!

- ఆదరణలేని వృద్ధులకు ఆశ్రయం
- అనాథ ఆశ్రమం ఓ దేవాలయం
- మేమున్నామంటూ అమ్మలా ఆదరిస్తున్న 'ఎలగందుల' వృద్ధాశ్రమం

ఖిలావరంగల్: నా అనే వాళ్లు లేక కొందరు.. ఉన్నా పట్టించుకోని వారు మరికొందరు.. కారణమేదైనా జీవితం చివరి దశలో పండుటాకులు ఆదరణ కోల్పోయి ఆశ్రమంలో కాలం వెళ్లదీస్తున్నారు. మానవసేవే మాధవ సేవగా భావిస్తూ అనాథలను అమ్మలా ఆదరిస్తూ సమాజ నిరాధరణ, కుటుంబ సభ్యుల నిర్లక్ష్యానికిలోనై నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పిస్తోంది. చివరికి చనిపోయాక కూడా దహన సంస్కారాలు నిర్వహిస్తుంది ఖిలావరంగల్ మండలంలోని రాంగోపాలపురంలోని ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమం. జిల్లాలోని సరస్వతీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎలగందుల లక్ష్మీనారాయణ ఎవరూలేని అనాథలతో పాటు కొడుకులు, కూతుర్లు చీదరించుకున్న తల్లిదండ్రులను ఆదరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. తల్లిలా లాలిస్తూ.. తండ్రిలా ఆదరిస్తూ.. కుటుంబ సభ్యుల్లా పలకరిస్తూ అనాథల కన్నీళ్లను తుడుస్తూ ముందుకు సాగుతున్నాడు.



మాట్లాడుతున్న నిర్వాహకుడు ఎలగందుల లక్ష్మీనారాయణ



ఆశ్రమంలో సేద తీరుతున్న వృద్ధులు..

ఆలోచన ఎలా వచ్చింది..

ఉపాధ్యాయ వృత్తిలో రిటైరయ్యాను.. సేవ చేయాలనే ఆలోచనతో 1999లో ఎలగందుల అమృత స్మారకార్థం ఆశ్రమం స్థాపించానంటున్నారు ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు ఎలగందుల లక్ష్మీనారాయణ. హెడ్ మాస్టర్‌గా రిటైర్డు అయిన తర్వాత సుమారు 1000 గజాల స్థలంలో రాంగోపాల్‌పురం గ్రామ సమీపంలో ఆశ్రమం నిర్మాణానికి నడుంబిగించాను. నిధుల లేమితో కొన్ని ఇబ్బందులు పడ్డాను. దాతల సహకారంతో అనుకున్న పనిని విజయవంతంగా కొనసాగిస్తున్నాను.

చనిపోయిన వారికి దహన సంస్కారాలు సైతం..

ఆశ్రమంలో చేరినప్పటి నుంచి చివరి వరకు ఉండి ఆ తర్వాత చనిపోయిన వృద్ధులకు దహన సంస్కారాలు ఆశ్రమ నిర్వాహకులే నిర్వహించడం విశేషం. ఒకసారి ఆశ్రమంలో చేరాక మా కుటుంబ సభ్యుల లాగే మేం భావిస్తామని, ఎవరైనా వృద్ధులు చనిపోతే మా ఇంట్లో సభ్యుడు చనిపోయిన విధంగా భావిస్తామని చెబుతున్నారు ఆశ్రమ నిర్వాహకులు.

ప్రభుత్వం సహకరిస్తే సేవలు విస్తరిస్తా..



నేను 70 ఏళ్ల వృద్ధుడిని..నాతోటి వృద్ధులకు చేరదీసి ఆకలి తీర్చాలన్నదే నాకోరిక. నాకు చిన్నప్పటి నుంచి సేవ చేయాలనే భావన ఉండేది. వృద్ధులు అంటే చీదరించుకునే వారు చాలామంది ఉన్నారు. నాకు చేతనైనంత సహాయం చేయడమే నాకు సంతృప్తి. ప్రభుత్వం సహకరిస్తే ఆదరణ కోల్పోయిన వారికి మరింత మందికి ఆశ్రయం కల్పిస్తాం.

\- లక్ష్మీనారాయణ ఆశ్రమ చైర్మన్

నాకు ఎవరూ లేరనే బాధ లేదు



ఈ ఆశ్రమంలో చేరినప్పటి నుంచి నాకు ఎవరూ లేరనే బాధ లేదు.నాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు ఉన్నారు. ఒక కొడుకు లోకానికి దూరమయ్యాడు. బిడ్డలు పట్టించుకోరూ. మనవళ్ల ప్రేమకు దూరం చేశారు. నన్ను మా మనవడు ఆశ్రమంలో ఉంచాడు. ఇక్కడివాళ్లు కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారు. నాకు ఏ లోటు లేదు.

\- జ్యోతి యాకమ్మ, వృద్ధురాలు

ఆరేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నా..



బస్సు ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయి. నా భార్య అనారోగ్యంతో మృతి చెందింది. నాకు ఏకైక కుమార్తె ఉన్నా.. నా కాళ్లు పోగానే నన్ను చీదిరించుకుని నేరుగా నన్ను ఆశ్రమంలో వదిలేసి వెళ్లింది. నా అత్త దేవత నాకు ఆర్థికసాయం చేస్తోంది. ఇక్కడి వారే నా బిడ్డలు తల్లిదండ్రులుగా భావిస్తున్నా.

\- తాదూరి వేణుగోపాల్

నెక్కొండలో మద్యం పట్టివేత

నెక్కొండ: అక్రమ మద్యంను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసిన సంఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ హథీరాం నాయక్ తెలిపిన వివరాలు... రైలు ద్వారా అక్రమ మద్యం దందాకు పాల్పడుతుండగా పక్కా సమాచారం మేరకు స్థానిక రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అతని వద్ద ఉన్న బ్యాగులను పోలీసులు సోదా చేశారు. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం గ్రామానికి చెందిన మహ్మద్ మెహబూబ్‌పాష, అతని కుమారుడు మహ్మద్ రఫీ మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యంను రైళ్ల ద్వారా తెలంగాణ రాష్ట్రానికి తీసుకొచ్చి విక్రయానికి పాల్పడుతునట్లు తేలిందని సీఐ పేర్కొన్నారు. మెహబూబ్‌పాషను అరెస్టు చేశామని, రఫీ పరారీలో ఉన్నట్లు చెప్పారు. వీరి నుంచి సిగ్నేచర్ ఫుల్ బాటిళ్లు 47, ఆర్‌సీ ఫుల్ బాటిళ్లు 12, వీటి విలువ సుమారు రూ. 73,305 ఉంటుందన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరీ, పోలీసులు, పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

- గర్భవతిని చేసి మరో యువతితో వివాహం
- యువకుడి మోసంపై పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

పాలకుర్తి టౌన్: ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని యువతిని లొంగదీసుకున్నాడు. గర్భవతిని చేసి అందరికి తెలిస్తే అసలుకే మోసం వస్తుందని గ్రహించి బలవంతగా అబార్షన్ చేయించాడు. అవసరం తీరాక మరో యువతిని వివాహం ఆడడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించిది. ఈ ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం శాతాపురం గ్రామానికి చెందిన లకావత్ వినోద్ జనగామ డిగ్రీ చదువుతున్న సమయంలో లింగాలఘణపురం మండలంలోని చీటూరు గ్రామానికి చెందిన రీణాతో పరిచయమైంది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని వినోద్ నమ్మబలికి ఇద్దరు శారీరక బంధానికి కారణమైంది. దీంతో ఆ యువతి గర్భం దాల్చింది. ఎన్నిసార్లు పెళ్లి విషయం అడిగినా సదరు యువకుడు మొహం చాటేశాడు. ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా మరో యువతిని వివాహం చేసుకున్నాడు. పెళ్లి విషయం ప్రేమికురాలికి తెలియగా అడుగుదామని ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. చివరికి యువకుడు పారిపోయాడు. శనివారం శాతాపురం గ్రామానికి వచ్చిన యువతి ప్రేమించి మోసం చేసిన యువకుడి ఇంటికి వెళ్లగా ఆ యువకుడి అక్క, బావ ఇద్దరు ఆ యువతిపై దాడికి పాల్పడ్డారు. స్థానికుల సహాయంతో పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో యువతికి చికిత్స అందించారు. ప్రేమంచి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వినోద్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. రీణా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు.



పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు రీణా

పెళ్లి ఇంట విషాదం

- గుండెపోటుతో వధువు తల్లి మృతి
- శోక సంద్రంలో ఇరు కుటుంబాలు



స్వరూప (ఫైల్)

బచ్చన్నపేట : అమ్మాయి, అబ్బాయి తరుపున వారందరూ కలిసి శుక్రవారం మండలంలోని శ్రీనిధి గార్డెన్‌లో వైభవంగా వివాహాన్ని జరిపించారు. రాత్రివేళ బరాత్ తీసి అమ్మాయి, అబ్బాయిని ఇంటిలోకి సాగనంపిన అనంతరం అమ్మాయి తల్లి శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఇరు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జక్కుల కనుకమ్మ, అయ్యాల్లం దంపతుల కుమారుడికి సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజేరుకు చెందిన జంగిలి స్వరూప (35), మల్లేశం దంపతుల కూతురు మౌనికను ఇచ్చి పెళ్లి జరిపించారు. శనివారం పదహారు పండుగ జరుపుకునే క్రమంలో అందరూ బీజీగా ఉండగా పెళ్లి కూతురు తల్లి స్వరూప ఉదయం మోహం కడుక్కుంటూ కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెళ్లి ఇంట్లో అశుభం జరుగడంతో వచ్చిన బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతురాలికి పెళ్లి కావల్సిన మరో ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



పెళ్లిలో అల్లుడు, కుమార్తెతో స్వరూప (కుడి వైపు నుంచి రెండో వ్యక్తి)

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి



చందు(ఫైల్)

వర్ధన్నపేట : బైక్‌పై వెళ్తున్న యువకుడికి రోడ్డుపై పంది అడ్డురావడంతో దానిని తప్పించబోయి కిందపడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రామారావు కథనం ప్రకారం.. వరంగల్ పోచమ్మమైదాన్‌కు చెందిన తాళ్లపెల్లి చందు(21) హన్మకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. శుక్రవారం కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని తన బైక్‌పై ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకుని తన స్నేహితుడైన సత్తు దిలీప్‌తో కలిసి వెళ్లాడు. అక్కడి నుంచి తన అమ్మమ్మ గ్రామమైన జనగాం జిల్లా జఫర్‌ఘడ్ మండలం తమ్మడపెల్లి(జి) గ్రామానికి రాత్రి చేరుకుని తిరిగి అదే రాత్రి తన స్నేహితుడు దిలీప్‌తో కలిసి బైక్‌పై వస్తుండగా వర్ధన్నపేట పిరంగిగడ్డ ప్రాంతంలో రోడ్డుపై పంది వచ్చింది. దానిని తప్పించబోయి కిందపడడంతో చందు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితుడు దిలీప్‌కు గాయాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి పూర్ణచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..

వరంగల్ (పర్వతగిరి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం తమ్మడపల్లి(ఐ) గ్రామానికి చెందిన మాచర్ల సిద్దార్థ(22) నెక్కొండ మండలం రెడ్లవాడలోని ఓ శుభకార్యానికి వెళ్లాడు. శుభకార్యం పూర్తయిన తర్వాత తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దార్థ తల్లి మాచర్ల అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై యాదగిరి తెలిపారు.



సిద్దార్థ మృతదేహం

దీనగాథ

సిద్దార్థ కుటుంబంలో తల్లి,తండ్రి వేరుగా ఉంటున్నారు. సిద్దార్థ ఎంబీఏ మొదటి సంవత్సరం మల్కాజిగిరిలో చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయడానికి వరంగల్‌లోని తన సోదరి ఇంటికి వచ్చి పరీక్షలు రాసి శుక్రవారం సాయంత్రం రెడ్లవాడలోని తన స్నేహితుడి శుభకార్యానికి హాజరై శనివారం తెలవారుజామున ఎవరికి తెలియకుండా ద్విచక్ర వాహనం వెళ్లాడు. చింతనెక్కొండ వద్ద బైక్ అదుపు తప్పి అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్..

కాజీపేట: గ్రేటర్ పరిధిలోని 62వ డివిజన్ సోమిడి శివారులో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బస్సు డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మసాగర్‌కు చెందిన ఎండీ.గౌస్ (45) మడికొండ రామన్ స్కూల్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పిల్లలను తీసుకుని కాజీపేటకు వస్తుండగా బస్సులో సాంకేతికలోపం తలెత్తడంతో ఆగిపోయింది. డ్రైవర్ కిందకు దిగి బస్సును మరమ్మతు చేస్తుండగా బస్సు ఆకస్మాత్తుగా ముందుకు కదలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని చేసి విచారణ చేపడుతున్నట్లు కాజీపేట పోలీసులు తెలిపారు.



మృతుడు ఎండీ.గౌస్ (ఫైల్)

రైలు ఢీకొని వ్యక్తి..

డోర్నకల్ : స్థానిక రైల్వే స్టేషన్‌లో శనివారం రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రైల్వే స్టేషన్ 4వ నంబర్ ప్లాట్‌ఫారం చివరన ఆర్ఆర్ఐ క్యాబిన్ ఎదుట రైలుపట్టాల ప్రక్కన మృతదేహం ఉందన్న సమాచారం మేరకు తమ సిబ్బంది ఘటనాస్థలానికి వెళ్లి స్థానికుల సహకారంతో మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుడిని స్థానిక మెయిన్‌రోడ్డుకు చెందిన కాలా వినోద్‌కుమార్‌జైన్(63)గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడు రాత్రివేళ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని తెలిపారు. ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు చెందిన అన్నం శ్రీనివాస్ ఘటనాస్థలానికి చేరుకుని తమ వాహనంలో మృతదేహాన్ని ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు భార్యకు దూరంగా ఒంటరిగా ఉంటుండగా డోర్నకల్‌లో సమీప బంధువులు ఉన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై దాడి

హసన్‌పర్తి: మండలంలోని వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మేర్గు రాజేష్‌పై దాడి జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వ్యక్తిగత పనులు ముగించుకుని బైక్‌పై రాజేష్ ఇంటికి బయల్దేరగా మార్గమధ్యలో ముగ్గురు వ్యక్తులు అడ్డంగా వచ్చి బైక్‌ను కాళ్లతో బలంగా కొట్టారు. ఈ సంఘటనలో రాజేష్ కిందపడడంతో బలమైన గాయాలయ్యాయి. మారణాయుధాలు ఉన్నట్లు గమనించిన రాజేష్ వారి నుంచి తప్పించుకున్నాడు. గమనించిన ఇద్దరు యువకులు కేకలు వేయడంతో వారు పరారయ్యారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు...

హసన్‌పర్తికి చెందిన రాకేష్, నితిన్, కన్నయ్య దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈఘటనలపై దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు నెలలుగానే...

ఇదిలా ఉండగా నాలుగు నెలలుగా రాజేష్‌పై దాడికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిసింది. రెండు నెలల క్రితం దామెర సమీపంలో రాజేష్‌పై దాడి చేయడానికి యత్నించారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

డిటోనేటర్ల కలకలం

- మేకల కాపరి ఇచ్చిన సమాచారంతో పోలీసుల అప్రమత్తం
- బాంబుస్క్వాడ్ తనిఖీల్లో బయటపడ్డ 500 డిటోనేటర్లు

బయ్యారం: మండలకేంద్రంలో శనివారం రాత్రి పోలీసులకు పట్టుబడ్డ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు స్థానికంగా కలకలం రేపాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వెనుకభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో ఒక గోనె సంచిలో ఎలక్ట్రిక్ డిటోనేటర్లు (మందుగుండు సామాగ్రి) ను మేకలకాపరి గుర్తించాడు. ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. వెంటనే ప్రాంతానికి చేరుకున్న గార్ల-బయ్యారం సీఐ బాలాజీ, ఎస్సై రమాదేవి సోదాలు నిర్వహించి బాంబుస్క్వాడ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ బృందం ఆ ప్రాంతానికి చేరుకొని పాత గోనెసంచిలో ఉన్న డిటోనేటర్లను స్వాధీనపర్చుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

జనావాసాల మధ్యకు ఎలా వచ్చాయి...?

పోలీస్‌స్టేషన్‌కు అరకిలోమీటర్ దూరంలో జనావాసాలు ఉండే ప్రాంతంలోకి పేలుడుకు ఉపయోగించే డిటోనేటర్లు ఎలా వచ్చాయి అనే ప్రశ్నలు పలువురిలో వ్యక్తమవుతున్నాయి. డిటోనేటర్లు లభ్యమైన బస్తాను బట్టి చూస్తే చాలా ఏళ్ల క్రితం వీటిని అక్కడ వదిలివెళ్లినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. డిటోనేటర్లను కంప్రెషర్‌బండ్ల నిర్వాహకులు పెట్టారా లేక గతంలో మండలంలో ప్రాబల్యం ఉన్న నక్సల్స్ గ్రూపులు పెట్టారా అనే విషయం విచారణలో తేలాల్సి ఉంది. ఈ విషయంపై సీఐ బాలజీని వివరణ కోరగా డిటోనేటర్లు లభ్యమైన విషయం వాస్తవమేనని ఈ డిటోనేటర్లను ఎవరు పెట్టారు అనే విషయంపై విచారణ నిర్వహిస్తామన్నారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య



జనార్థన్ మృతదేహం

సంగెం : మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కటంగూర్ మండలం చెరువు అన్నారం గ్రామానికి చెందిన వరికుప్పల ఇస్తారి భార్య పిల్లలతో కలిసి వచ్చి ఏడేళ్లుగా తిమ్మాపూర్‌లో ఉంటూ బావులు పూడికతీస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇస్తారి కుమారుడు జనార్ధన్ (22) నాలుగేళ్ల క్రితం ఎల్గూర్‌రంగంపేటకు చెందిన అనూషను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల జనార్ధన్ తాగుడుకు బానిసయ్యాడు. శనివారం బాలునాయక్ తండాలో బావిపూడికకు తల్లిదండ్రులతో కలిసి వెళ్లిన అతను పనిచేయకుండా ఇంటికి తిరిగివచ్చాడు. భార్య అనూష బట్టలు ఉతికి సాయంత్రం వెళ్లి చూడగా లోపల గొళ్లెం పెట్టి ఉంది. అనుమానం వచ్చి చుట్టుపక్కల వారు నరేష్, రాజులను పిలువగా తలుపులు తెరిచేసరికి ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. మద్యానికి బానిసైన జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి ఇస్తారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.